
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

3



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

బుధవారం 4 డిసెంబరు 2024

ఆశలు రేపిన రేవంత్



ఏడాది పూర్తయిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల పాలన

- ప్రతిపాదనలు చేస్తున్నా నిధుల మంజూరు లేక ఇబ్బందులు
- రైతు పండుగలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో ఎమ్మెల్యేల్లో ఆశలు
- ఇప్పటికే కొన్ని నియోజకవర్గాలకు విడుదలవుతున్న నిధుల జీవోలు
- నిధులు వస్తేనే జనంలో తిరగడానికి వీలవుతుందంటున్న ఎమ్మెల్యేలు

"వలస జిల్లా పచ్చబడి పోయి.. పసిడి పంటలు పండాలి.. గ్రీన్ చానల్ ద్వారా నిధులు ఇచ్చి.. అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తా.. అభివృద్ధి. పనులకు ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున రూ.లక్ష కోట్లు విడుదల చేస్తా.. ఈ ప్రాంత బిడ్డగా చిన్నప్పటి నుంచి ప్రజల కన్నీళ్లు, వలస కష్టాలు, కష్టపడే తత్వం తెలుసు.. నాకూ ఓ రోజు వస్తుందని ఎదురుచూస్తే 70 ఏళ్ల తర్వాత పాలమూరు బిడ్డ సీఎం అయ్యారు.. ఇప్పుడు అభివృద్ధి చేయకపోతే చరిత్ర నన్ను క్షమించదు.. పాలమూరును అభివృద్ధి చేద్దామనుకుంటే కాళ్లల్లో కట్టె పెడుతున్నారు... ఎవరు అడ్డొచ్చినా, ఆటంకాలు సృష్టించినా.. తొక్కుకుంటూ వెళ్తా.. ఎవరొచ్చినా పాలమూరును దత్తత తీసుకుంటానని అంటారు.. కానీ, దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన అవసరం లేదు.. పాలమూరు బిడ్డనే సీఎం.."

రాష్ట్ర రైతు పండుగ సందర్భంగా గత శనివారం మహబూబ్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభకు కదలి వచ్చిన అశేషజనం ముందు తన మంత్రివర్గ సహచరుల సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వాగ్దానం..



మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్ శివారులో గత శనివారం నిర్వహించిన రైతు పండుగ సభలో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కొత్త ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ పార్టీ కొంగొత్త పాలన ప్రారంభించి ఏడాది పూర్తయ్యింది. ఎన్నో ఆశల నడుమ ఉమ్మడి పాలమూరు జిల్లాలో నలుగురు మినహా పది మంది కొత్త ఎమ్మెల్యేలను గెలిపించారు. ఏడాదిలో కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు కూడా పాలనా శైలిని అలవర్చుకున్నారు. కొందరు ఇంకా తప్పటడుగులు వేస్తున్నప్పటికీ ఇంకొందరు ఉత్సాహంగా తమ పనుల సాధన కోసం పనిచేస్తున్నారు. అయితే ఈ ఎమ్మెల్యేలు గెలిచిన తర్వాత నుంచి ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో నిధులు రావడం లేదనే అసంతృప్తి చాలామందిలో ఉన్నది. పేరుకు ప్రతిపాదనలు పంపిస్తున్నప్పటికీ ఆర్థిక శాఖ నుంచి ఆమోదం రావడం

(మిగతా 4లో..)

నిలిచిన చేయూత



నారాయణపేటలో మగ్గంపై చీర నేస్తున్న మహిళా కార్మికురాలు

- నేత కార్మికులకు అందని పథకాలు
- త్రిఫ్ట్ ఫండ్, సబ్సిడీపై ముడిసరకు నిలుపుదల
- స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు

నారాయణపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో పవర్ లూమ్‌ల వల్ల.. మగ్గాలతో నేస్తున్న చీరలకు మార్కెటింగ్ సౌకర్యం లేక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దానికి తోడు గత ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్నారు. నారాయణపేట జిల్లాలో చేనేత రంగానికి వందేళ్ల చరిత్ర ఉంది. అందమైన, అధునాతన డిజైన్లతో మహిళల మనస్సు దోచేలా నారాయణపేట జిల్లాలో కాటన్ చీరలను కార్మికులు తయారు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు వేల మంది చేనేత కార్మికులు ఉన్నారు. గత ప్రభుత్వ కేవలం 735 మగ్గాలకు మాత్రమే జియో ట్యాగింగ్ చేసింది. నారాయణపేట, కోటకొండ, జాజాపూర్, చిన్నజట్రం, పేరపళ్ల, దామరగిద్ద, మద్దూర్, కోస్గి, పోతిరెడ్డిపల్లి, చిన్నపొర్ల తదితర గ్రామాల్లో చేనేత కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం మిగిలిన మగ్గాలకు కూడా జియో ట్యాగింగ్ చేయాలని కార్మికులు కోరుతున్నారు. మరోవైపు చీరలు విక్రయించాలంటే హైదరాబాద్, విజయవాడ, బెంగుళూర్, ఢిల్లీ, పుణె తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉందని, అందుకే స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని అంటున్నారు. మార్కెటింగ్ సౌకర్యం లేక చాలా మంది కార్మికులు మాస్టర్ వీవర్‌లు ఇచ్చే ముడి సరుకులు తీసుకుని సొంత మగ్గాలపై చీరలు నేస్తున్నారు. అందుకుగాను మాస్టర్ వీవర్లు ఒక్కో చీరకు రూ.170 మాత్రమే ఇస్తున్నారు.

హెల్త్‌కార్డులు అందించాలి

నేత పనితో కార్మికులకు కంటి చూపు తగ్గడంతో పాటు చేతులు, కాళ్ల, నడుము నొప్పులు రావడం, షుగర్, బీపీల బారిన పడుతున్నారు. అందుకే తమకు హెల్త్ కార్డులు అందించి, ఉచిత వైద్యం సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. కొత్తగా మగ్గాలు, ముడి సరుకు సబ్సిడీపై ఇవ్వాలని, తాము నేసిన చీరలను..

(మిగతా 4లో..)

అక్షర ప్రగతిలో ఎందాక అడుగులు



- నేడు ఎన్ఏఎస్ పరీక్ష
- 84 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

4

అభివృద్ధి చేస్తే.. అద్భుత పర్యాటకం



- అందుబాటులో తొమ్మిది ఎకరాల టూరిజం శాఖ భూములు
- జాతీయ రహదారి పక్కనే ప్రాజెక్టు
- డిండికి రూ.5 కోట్లు మంజూరు

4

రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసుకుంటాం



- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- అలంపూర్ ఆలయాల్లో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు

5

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం సురక్షితం

- త్వరలోనే కంటి ఆపరేషన్లు ప్రారంభిస్తాం
- ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక క్లినిక్
- జనవరి నాటికి సీటీ స్కాన్ ఏర్పాటు
- గద్వాల జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వినోద్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల చివరి నాటికి కంటి ఆపరేషన్లు ప్రారంభిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా ప్రజలు ఇక ఇతర ఆపరేషన్ల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే వినియోగించుకోవాలని మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ వినోద్‌కుమార్

ఆసుపత్రిలో ఎన్ని రకాల సేవలు అందిస్తున్నారు?

ప్రజల ఆరోగ్య సమస్యలను నివారించేందుకు సిబ్బంది ఎల్లవేళలా కృషి చేస్తున్నారు. ప్రతీ రోజు దాదాపు 700 దాకా, సోమవారం వెయ్యి దాకా ఓపీ సేవలు అందిస్తున్నాం.

జిల్లా ఆసుపత్రిలో డాక్టర్ల కొరత ఉందా?

ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత లేకుండా కలెక్టర్ కృషి చేస్తున్నారు. ప్రస్తుతానికి కొందరు కొత్త డాక్టర్లు విధుల్లో చేరారు. గైనిక్ డాక్టర్ల కొరత ఉంది. ప్రస్తుతానికి గైనిక్‌కు సంబంధించి నలుగురు డాక్టర్లు ఉన్నారు. ఇంకా నలుగురు వస్తే ఇబ్బందులు ఉండవు.

కాన్పుల సంఖ్య ఎలా ఉంది?

ప్రతీ నెల దాదాపు 300 పైగానే కాన్పులు జరుగుతున్నాయి. గత నెల 307 కాన్పులు కాగా, ఇందులో సాధారణంగా 192, సిజేరియన్ కాన్పులు 115 జరిగాయి.

ఆసుపత్రిలో మందుల కొరత ఉందా?

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత లేదు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో లేకపోతే అత్యవసర పరిస్థితితో బయటకు పంపిస్తున్నాం.

ట్రాన్స్‌జెండర్లకు క్లినిక్ ఏర్పాటు చేశారా?

జిల్లా ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక క్లినిక్‌ను ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. జనవరి నాటికి పూర్తయ్యేలా చూస్తున్నాం. వారంలో ఒక రోజు ఓపీలు, రక్త పరీక్షలు నిర్వహిస్తాం.

సీటీ స్కాన్ వచ్చే అవకాశం ఉందా?

వచ్చే ఏడాది జనవరి నెలలో సిటిస్కాన్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. ఇందుకు సంబంధించి పనులు చురుకుగా సాగుతున్నాయి.

ప్రజలకు మీరిచ్చే సూచనలు ఏమిటి?

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం సురక్షితం. పరికరాలు, డాక్టర్లు అందుబాటులో ఉండి ఎల్లవేళలా వైద్యసేవలు అందిస్తారు. ఉచిత వైద్యసేవలను వినియోగించుకోవాలి.

పొగాకు మండేనా?

- తుఫాన్‌తో తడిసిన ఆకు
- కోతల సమయంలో దెబ్బతింటున్న పొగాకు
- గతేడాది అత్యధిక ధర
- ఎన్నడూ లేనివిధంగా భారీగా సాగు

అలంపూర్ చౌరస్తా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నడిగడ్డ అనగానే సాంప్రదాయ పంటలకు పెట్టింది పేరు. అలాంటిది వందేళ్లలో ఎన్నడూ లేని విధంగా పొగాకు సాగు వైపు రైతులు మొగ్గుచూపారు. మూడేళ్ల వ్యవధిలో పొగాకు సాగు పెరుగుతూ వస్తుంది. గతేడాది సాగు చేసిన పంటకు అధిక ధరలు పలకడమే దీనికి ప్రధాన కారణం. జోగుళాంబ గద్వాల జిల్లాలో సుమారు 25వేల ఎకరాలలో పొగాకు సాగైనట్లు అధికారులు తెలిపారు. ఇది గతేడాదికి మూడింతలు అధికం.

ఇక్కడి పొగాకుపై కంపెనీల దృష్టి

ఇక్కడి ప్రాంతంలో ఏళ్లుగా వివిఎస్టీ కంపెనీయే రైతుల నుంచి పొగాకు కొనేది. మొదట్లో స్థానికంగా పొగాకు సాగుకు ఆసక్తి చూపకపోవడంతో కర్ణాటక రాష్ట్రంలోని..



మానవపాడులో తోరణాలు కట్టిన పొగాకుకు టార్పాలిన్లు కప్పిన రైతులు

- (మిగతా 4లో..)



వనపట్లలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

వరిని తక్కువ ధరకు అమ్ముకోవద్దు

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరకు అమ్ముకోవద్దని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ మండలం వనపట్ల గ్రామ రైతు వేదిక వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరతోపాటు సన్న రకానికి రూ.500 బోనస్ అందిస్తుందని, రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోవద్దని సూచించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కేంద్రానికి వచ్చిందని ఆయన ఆరా తీశారు. రైతుల నుంచి ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ట్రాన్స్‌పోర్టు, గోనె సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆయన రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరి అకాల వర్షాలకు తడవకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. తేమ శాతం పరిశీలించి వెంటనే కొనుగోలు చేసి అందుకు మూడు రోజుల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చునని, వెంటనే సరి చేస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట వరి కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

దుకాణాలకు రేషన్ బియ్యం

- ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన యంత్రాంగం



అయిజ సివిల్ సప్లయ్ గోదాం నుంచి లారీలో బియ్యం సంచులు లోడ్ చేస్తున్న హమాలీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అయిజ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'నిండుకున్న గోదాంలు' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో కథనం ప్రచురితం అయ్యింది. బియ్యం లేని కారణంగా అధికారులు, లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తు చేయటం జరిగింది. ఈ కథనంపై స్పందించిన అధికారులు యుద్ధ ప్రతిపాదికన చౌకధర దుకాణాలకు రేషన్ సరఫరాను ప్రారంభించారు. మంగళవారం సాయంత్రంలోపు జిల్లాలోని వంద రేషన్ దుకాణాలకు పైగా బియ్యం సరఫరా చేసినట్లు డీఎస్‌వో ఆవులస్వామికుమార్ తెలిపారు. వెయ్యి మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేసినట్లు చెప్పారు. దీంతో రేషన్ దుకాణాలలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ సజావుగా సాగనుంది.

సమయానుసారంగా వ్యాక్సిన్ ఇస్తేనే ఆరోగ్యం

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి
- గద్వాల, వనపర్తి జిల్లాల సిబ్బందికి వ్యాక్సినేషన్‌పై ఒక రోజు శిక్షణ
- హాజరైన డబ్ల్యూహెచ్‌వో బృందం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, చిత్రంలో అధికారులు

వనపర్తి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, పిల్లలకు సమయానుసారంగా వ్యాక్సిన్ ఇస్తే ఆరోగ్యవంతమైన యువతను తయారు చేయవచ్చని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా గద్వాల వనపర్తి జిల్లాల వ్యాక్సినేషన్ ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్‌వైజర్లకు టీకాల ఒక రోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి శిక్షణ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యాధిని అరికట్టడానికి శాస్త్రవేత్తలు కొన్ని ఏళ్ల తరబడి కష్టపడి రూ.కోట్ల ఖర్చుతో వ్యాక్సిన్ తయారు చేయడం జరుగుతుందన్నారు. అలాంటి టీకాలు గర్భిణులకు, పిల్లలకు ఒక నిర్ధిష్ట సమయంలో ఇస్తేనే అవి పని చేస్తాయని, లేనిపక్షంలో వృథా అవుతుందన్నారు. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వ్యాక్సిన్ నిపుణులను పిలిపించి మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్‌వైజర్లకు ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లలకు టీకా ఇప్పించడం అనేది మహత్తర కార్యక్రమమని, వైద్య సిబ్బంది బాగా పని చేసి వనపర్తి జిల్లాను రాష్ట్రంలో మూడో స్థానంలో ఉంచినందుకు అభినందనలు తెలిపారు. డీఎంహెచ్‌వో శ్రీనివాస్, డబ్ల్యూహెచ్‌వో బృందం మురారి, అజర్, డేవిడ్, జ్యోత్స్న పాల్గొన్నారు.

ఆశలు రేపిన రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

లేదని పలువురు బహటంగానే విమర్శలు చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీల అమలు, రుణమాఫీ, పాత బిల్లుల చెల్లింపుపై ఎక్కువగా దృష్టి సారించడంతో కొత్త పనులకు నిధులు రావడం లేదని, కొంత ఆర్థిక సమతుల్యత రావాలని చెప్పడంతో ఇన్నాళ్లు ఎమ్మెల్యేలు స్తబ్దుగా ఉన్నారు. కానీ, ఇప్పుడు ప్రజల్లోకి వెళ్లాలంటే నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉందని నేరుగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు వినతిపత్రాలు అందజేస్తున్నారు. గతంతో పోల్చితే ఈ రెండు నెలలుగా నిధుల విషయంలో కొంత సడలింపు దొరికిందని, జనవరి నుంచి పాలమూరు జిల్లాకు నిధులు ఎక్కువగా విడుదలవుతాయని, ఆ మేరకు ఆర్థిక శాఖ కూడా పరిపాలనా అనుమతుల జారీకి సిద్ధమవుతోందని ఎమ్మెల్యేలు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వంలో మంజూరై నిధులు లేక ఆగిన పనులతో పాటు ఈ ప్రభుత్వంలో కొత్తగా చేసిన ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తుందని, నిధులు కూడా విడుదలవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిధుల మంజూరు షురూ..

రాష్ట్ర ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మొదట సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం పరిధిలో కొడంగల్- నారాయణపేట ఎత్తిపోతల పథకంతో పాటు వివిధ అభివృద్ధి పనులకు రూ. 5 వేల కోట్ల వరకు నిధులు మంజూరు చేసుకొని శంకుస్థాపనలు చేశారు. తాజాగా కొడంగల్, కోస్గి మునిసిపాలిటీలకు సంబంధించి కడా ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు రూ. 690 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందులో నారాయణపేట జిల్లా పరిధిలోని కోస్గి మునిసిపాలిటీకి రూ. 353.34 కోట్లు విడుదలయ్యాయి. అలాగే జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించి ఉదండాపూర్ ఆర్అండ్ఆర్‌తో పాటు ఆర్అండ్‌బీ రోడ్లకు సంబంధించి నిధులు మంజూరయ్యాయి. దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించి కురుమూర్తి స్వామి టెంపుల్ ఎలివేటెడ్ ఘాట్ రోడ్డుకు రూ. 110 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. అచ్చంపేట నియోజకవర్గంలో టూరిజం కోసం రూ. 25 కోట్లు ఇలా పలు నియోజకవర్గాల్లో నిధుల మంజూరు ప్రారంభమైంది. మహబూబ్‌నగర్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో కోర్టు కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు మూడు జిల్లాలకు రూ. 81 కోట్ల చొప్పున రూ. 243 కోట్లు మంజూరయ్యాయి. ఇవి కాకుండా అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి జీఓలు వచ్చాయి. దానికి విధివిధానాలు ఖరారు చేసి నిర్మాణాలకు శంకుస్థాపన చేయాల్సి ఉంది. ఒక్కో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి సుమారు రూ. 100 కోట్లకు పైచిలుకు వ్యయం కానుంది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పలు కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వాటికి కూడా జనవరి నుంచి మంజూరు వస్తాయని భావిస్తున్నారు.

సీఎం హామీతో..

ఈ నెల 30న రైతు పండుగ ముగింపు సభ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లాకు నిధుల విడుదలపై ప్రకటన చేశారు. సీఎం సొంత జిల్లా కావడంతో ఉమ్మడి పాలమూరుకు అధిక నిధులకు మంత్రులు సానుకూలంగా స్పందించాలని సభా వేదికగా కోరారు. ఒక్కో ఏడాది ఉమ్మడి పాలమూరు జిల్లాకు రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని ప్రకటించారు. రానున్న ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల కేటాయింపులు చేస్తానని ప్రకటించారు. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎమ్మెల్యేలంతా నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతున్న వేళ ఈ నిధుల విడుదల అనివార్యంగా మారనుంది. సొంత జిల్లాలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మొత్తం 14 నియోజకవర్గాలకు గాను 12 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా ప్రజలు గెలిపించారు. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓటమి చెందగా పార్లమెంట్ ఎన్నికల్లో ఒక స్థానం కాంగ్రెస్ పార్టీ కోల్పోయింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో సొంత జిల్లాలో సత్తా చాటాలంటే భారీగా నిధులు విడుదల అవసరం కానుంది. అలాగే సర్పంచులకు పెండింగ్ బిల్లులను విడుదల చేయడంతో పాటు. కొత్త పనులను మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

ఐక్యతతోనే ఎరుకల అభివృద్ధి

● ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీఏ కృష్ణయ్య

పాలమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎరుకలు ఐక్యతతోనే అభివృద్ధి చెందుతారని తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీఏ కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎరుకలు సంక్షేమం, చైతన్యం, హక్కుల పరిరక్షణ, హక్కుల సాధన, ఆత్మగౌరవం పొందాలంటే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందటానికి ఐక్యమత్యంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల నిర్మాణం చేసుకుని పనిచేయాలన్నారు. ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ చైర్మన్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. నాయకులు అల్లీపూర్ చంద్రయ్య, పులిరెడ్డి రాములు, రామచంద్రయ్య, మురహరి, అంజనేయులు, కృష్ణయ్య, కొండన్న, అంజన్న, సురేందర్, తిరుమలేష్, కృష్ణయ్య, లక్ష్మి, అలివేలు పాల్గొన్నారు.

నిలిచిన చేయూత



మగ్గంపై చీర నేస్తున్న కార్మికుడు


(మొదటి పేజీ తరువాయి)

నేరుగా టెస్కో కొనుగోలు చేయాలని అంటున్నారు. మార్కెట్ పోటీని తట్టుకునేలా అధునాతన బార్డర్ డిజైన్లపై శిక్షణ ఇవ్వాలని, చేనేత రుణాలు మాఫీ చేయడంతో పాటు వడ్డీ లేకుండా ముద్ర రుణాలు అందించాలని కార్మికులు కోరుతున్నారు.

నిలిచిపోయిన పథకాలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు చేనేత పథకాలు నిలిచిపోయాయి. 2021 సెప్టెంబరులో ప్రారంభించిన త్రిఫ్ట్ ఫండ్ పథకం ఈ ఏడాది సెప్టెంబరులో ముగిసింది. ఈ పథకం కింద కార్మికుడు ప్రతీ నెల తన ఆదాయంలో ఎనిమిది శాతం బ్యాంకులో జమ చేస్తే రాష్ట్ర ప్రభుత్వం అందుకు మరో ఎనిమిది శాతం వాటా అకౌంట్‌లో జమ చేస్తుంది. ఈ పథకం గడువు మూడేళ్లు ఉన్నది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ డబ్బులను అందజేసింది. ఈ పథకం కింద 1,207 మంది కార్మికులకు రూ.8.30 కోట్లు అందాయి. ఆ డబ్బులతో ప్రయోజనం చేకూరిందని, ఆ పథకాన్ని మళ్లీ అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారు.

● చేయూత పథకంలో భాగంగా జియో ట్యాగింగ్ ఉన్న మగ్గాల కార్మికులకు ప్రతీ నెల రూ.3,000 చొప్పున గత ప్రభుత్వం అందించింది. ఆ డబ్బుల్లో కార్మికుడు రూ.2,000 తీసుకుని, మిగతా రూ.1,000 ఇద్దరు సహాయ కార్మికులకు ఇచ్చేవారు. ఈ పథకం కూడా నిలిచిపోయింది. సబ్సిడీపై ఇచ్చే యార్న్ కాటన్, సిల్క్ దారమూ అందడం లేదు.



నారాయణపేట కార్మికులు నేసిన కాటన్ చీరలు

ప్రభుత్వమే ఆదుకోవాలి



నారాయణపేటలో 20 ఏండ్లుగా చీరలు నేస్తున్నా. పొద్దస్తామనం చీర నేస్తే రూ.170 కూలీ వస్తోంది. అది గిట్టుబాటు కావడం లేదు. నిలిచిపోయిన ప్రభుత్వ పథకాలను పునరుద్ధరించాలి. ముడి సరుకు నూలు, పట్టు ప్రభుత్వం సబ్సిడీపై అందించాలి. కార్మికుల నుంచి చీరలు ప్రభుత్వమే కొనుగోలు చేసి, అన్ని విధాలుగా ఆదుకోవాలి.

- గోవింద్, చేనేత కార్మికుడు

హస్త కళలను ప్రోత్సహించాలి



త్రిఫ్ట్ ఫండ్, చేయూత, పట్టు, కాటన్ నూలు సబ్సిడీ అందించే పథకాలు పునరుద్ధరించి, హస్త కళలను ప్రోత్సహించాలి. జియోట్యాగింగ్ అన్ని మగ్గాలకు చేయాలి. రుణాలు మాఫీ చేసి, ముద్ర రుణాలు అందించాలి.

- కెంచి శ్రీనివాస్, చేనేత కార్మిక సంఘం సభ్యుడు, కోటకొండ

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

● రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషన్ మెంబర్ చారుకొండ వెంకటేశ్

● జాజాపూర్ పాఠశాల తనిఖీ

నారాయణపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఈసారి వంద శాతం ఉత్తీర్ణతాశాతాన్ని సాధించి పాఠశాల పేరును జిల్లా స్థాయిలో నిలపాలని రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషన్ మెంబర్ చారుకొండ వెంకటేశ్ అన్నారు. మంగళవారం ఆయన డీఈవో గోవిందరాజులుతో కలిసి నారాయణపేట మండలంలోని జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం చేయాలని వంట నిర్వాహకులను ఆదేశించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరేంద్రకృష్ణ, హెచ్‌ఎం భారతి, ఎస్‌వో శ్రీనివాస్, ఉపాధ్యాయులు నిర్మల, నరసింహ, శ్రీదేవి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లకు కొత్త ఫోర్స్

● మహబూబ్‌నగర్ జిల్లాకు 169 మంది, నారాయణపేట జిల్లాకు 78 మంది కానిస్టేబుల్స్ కేటాయింపు

మహబూబ్‌నగర్/నారాయణపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అరకొర సిబ్బందితో కాలం వెళ్లదీస్తున్న మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పోలీస్ స్టేషన్‌లకు కొత్త ఫోర్స్ వచ్చేసింది. ఇప్పటికే శిక్షణ పూర్తిచేసుకున్న వీరిని ఆయా జిల్లాలకు అలాట్ చేయగా, మహబూబ్‌నగర్ జిల్లాలో రిపోర్ట్ కూడా చేశారు. ప్రస్తుతం జడ్చర్ల డీటీసీలో ఉన్న వీరికి పోలీస్ స్టేషన్‌లలో విధులు ఎలా నిర్వహించాలనే విషయంపై ఐదు రోజుల పాటు సీనియర్ అధికారులు శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం నుంచి ఈ నెల ఏడో తేదీ వరకు శిక్షణ ఇచ్చి, తరువాత స్టేషన్‌లను అలాట్ చేయనున్నారు. వారు ఈనెల తొమ్మిదో తేదీ నుంచి కేటాయించిన పోలీస్‌స్టేషన్‌లలో పూర్తి స్థాయిలో విధులు నిర్వర్తించనున్నారు. జిల్లాకు 169 మంది కానిస్టేబుల్స్‌ను అలాట్ చేశారు. అందులో 48 మంది మహిళలు ఉన్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లలో మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉంది. వీరి రాకతో ఆ సమస్య చాలా వరకు తీరనుంది. జిల్లాలో మొత్తం 19 పోలీస్ స్టేషన్‌లున్నాయి. ఒక్కో స్టేషన్‌కు 8-10 మందిని కేటాయించనున్నారు.



నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు సూచనలిస్తున్న సీఐ శివశంకర్

మహబూబ్‌నగర్ రూరల్‌కు సిబ్బంది కొరత

జిల్లాలో మహబూబ్‌నగర్ రూరల్, జడ్చర్ల వంటి స్టేషన్‌లకు కొంత ఎక్కువ మంది సిబ్బంది అవసరం అవుతారు. ఇక్కడ ప్రతీ నెల కేసులు అధికంగా నమోదవుతుంటాయి. చాలా కేసులు సిబ్బంది లేక పెండింగ్ పడుతున్నాయి. ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోరని బాధితుల్లోనూ అసంతృప్తి ఉంది. మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలో మూడు స్టేషన్‌ల అంత పరిధి ఉన్నా అది అప్‌గ్రేడ్ కాకపోవడంతో ఎస్ఐ ఎస్‌హెచ్‌వోగానే ఉంది. దాంతో అక్కడికి తక్కువ మందిని కేటాయించారు. దీంతో అక్కడ పెట్రోలింగ్, బందోబస్తు చేయడానికి ఉన్నవారితో నెట్టుకురాలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ స్టేషన్ పరిధిలో ఎక్కువగా దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, గొడవలు జరుగుతుంటాయి. చాలీచాలని సిబ్బందితో కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటికే ఇక్కడ త్రీ టౌన్ ఏర్పాటు చేయాలన్నా ప్రతిపాదన ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. కొత్తగా వచ్చిన కానిస్టేబుళ్ల కేటాయింపులో రూరల్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కూ స్టాఫ్ తక్కువగానే ఉంది. ఇక్కడ అలాట్ అయిన వారి కన్నా తక్కువ సిబ్బంది ఉన్నారు. ఈ స్టేషన్‌కు కూడా సిబ్బంది కేటాయింపులు జరగాల్సి ఉంది.

నారాయణపేట జిల్లాలో విధుల్లో చేరిన పోలీసులు

నారాయణపేట జిల్లాలో 78 మంది పోలీస్ సిబ్బంది కొత్తగా విధుల్లో చేరారు. జిల్లా వ్యాప్తంగా 12 పోలీస్ స్టేషన్స్, నాలుగు సర్కిల్స్ ఉన్నాయి. అందులో 47 మంది సివిల్ కానిస్టేబుల్స్ ఉండగా, 34 మంది పురుషులు, 13 మంది మహిళలు ఉన్నారు. 31 ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు రాగా, వారిలో 26 మంది పురుషులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు జిల్లా హెడ్‌క్వాటర్స్‌లో అందుబాటులో ఉంటారు. అల్లర్లు, ధర్నాలు, రాస్తారోకోలు జరుగుతున్న సమయంలో వీరు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తారు.

పునరావాసం ప్యాకేజీని పెంచాలి



జడ్చర్ల ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్దకు తరలివచ్చిన నిర్వాసితులు

జడ్చర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పునరావాసం ప్యాకేజీ పెంచాలని, పరిహారం, ఇళ్ల స్థలాలు ఒకే పర్యాయం ఇవ్వాలని, తాజాగా గణనలోకి తీసుకుని 18 ఏళ్ల వయస్సు వారికి సైతం పరిహారం వర్తింపజేయాలని ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డికి ఉదండాపూర్ నిర్వాసితులు విజ్ఞప్తి చేశారు. ఉదండాపూర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కోరడంతో ఫాస్ట్‌ట్రాక్‌తో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానంటూ మంత్రి ఇటీవల హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి మంగళవారం జడ్చర్ల ఆర్అండ్‌బీ అతిథి గృహానికి వచ్చి, నిర్వాసితుల సమస్యలను తెలుసుకున్నారు. ఉదండాపూర్, వల్లూరు గ్రామాలకు చెందిన నిర్వాసితులు సమస్యలను వెల్లడించారు. పరిహారం ప్యాకేజీని రూ.16.32 లక్షలకు పెంచాలన్నారు. 2021లో ఉన్న 18 ఏళ్లు ఉన్న వారి కటాఫ్ తేదీని తాజాగా పరిగణలోకి తీసుకుని, వారికీ పరిహారం ఇవ్వాలని కోరారు. ఆధార్‌కార్డు వయస్సు నిర్ధారణను పరిగణలోకి తీసుకోవాలని, దీంతో దాదాపు 40 మందికి లబ్ధి చేకూరుతుందంటూ వివరించారు. వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలలో దొరలు విక్రయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నామని, ఆ స్థలాలకు సైతం పరిహారం ఇప్పించాలని కోరారు. పునరావాస కేంద్రం కోసం సర్వే నెంబరు 554లో సేకరించిన 79.39 ఎకరాల అసైన్డ్ భూములలో 39.08 ఎకరాల అవార్డును భూములకు సంబంధంలేని వారికి మంజూరు చేశారని అసైన్డ్ భూమిదారులు వినయ్‌కృష్ణారెడ్డికి తెలిపారు. అలాగే సర్వే నెంబరు 426లో 14 ఎకరాల అసైన్డ్ భూమి సేకరించారని, భూములకు సంబంధంలేని వ్యక్తులకు అవార్డు మంజూరు చేశారని చెప్పారు. రిజర్వాయర్ కోసం మొట్టమొదటగా తాము ముందుకు వచ్చామని, భూములు కోల్పోయిన తమకు పునరావాసం ప్యాకేజీని వర్తింపచేయాలంటూ కిష్టారం గ్రామస్థులు కోరారు. భూములకు కేవలం ఎకరాకు రూ.5.50 లక్షల పరిహారం మాత్రమే ఇచ్చారని, ప్రస్తుతం మార్కెట్ విలువ ఆధారంగా రూ.50 లక్షల పరిహారం ఇప్పించాలని కోరారు.

నివేదికను ప్రభుత్వానికి అందిస్తా: వినయ్‌కృష్ణారెడ్డి

నిర్వాసితుల సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తానని ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా యంత్రాంగంతో పరిష్కారమయ్యే సమస్యలపై అధికారులతో మాట్లాడతానన్నారు. కార్యక్రమంలో ఎస్పీ జానకి, జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు, స్పెషల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఇరిగేషన్‌శాఖ ఎస్ఈలు సత్యశీలారెడ్డి, రమేశ్‌జాదవ్, ఉదయ్‌శంకర్, ఈఈలు రవీందర్, జైపాల్, అధికారులు పాల్గొన్నారు.

పొగాకు మండేనా?



ఉండవల్లిలో వర్షానికి పొలంలోనే తడిసిన కోతకోసిన పొగాకు పంట

(మొదటి పేజీ తరువాయి)

రాయచూరు జిల్లాలో రైతుల చేత సాగు చేయించేవారు. యూరో పియన్ దేశాలలో నాలుగేళ్లుగా యుద్ధ వాతావరణం నెలకొ నడంతో పొగాకు ఉత్పత్తులు తగ్గిపోవడమే గాక ఎగుమ తులు, దిగుమ తులపై ప్రభావం పడింది. వెరసి ఆయా దేశాలలో పొగాకు ఉత్పత్తులకు అధిక డిమాండ్ ఏర్ప డటంతో రెండేళ్ల క్రితం ఐటీసీ, జీపీఐ, అలయాన్స్, డెక్కన్, వీడీపీ, బొంబడాయిల్ తదితర ప్రైవేట్ పొగాకు కంపెనీలు రెండు తెలుగు రాష్ట్రాలలోకి ప్రవేశించాయి. క్వింటాల్‌కు 50శాతం పెంచి కొంటామని జిల్లా రైతులను పొగాకు సా గుకు ప్రోత్సహించారు. అన్నట్లుగానే రెండేళ్లకు ముందు రూ.8వేలు మాత్రమే ఉన్న ధర రూ. 15వేల దాక పెంచి కొనుగోలు చేశారు. రైతులకు లాభాలు రావడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15వేలు, రబీ సీజన్‌లో 18వేల ఎకరాలకు పైగా పొగాకు సాగుచేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 35వేల ఎకరా లలో సాగు చేసినట్లు తెలుస్తోంది.

భారీ దిగుబడుల వైపు..

ఖరీఫ్ సీజన్‌లోనే సాగు చేసిన రైతులకు ఇప్పుడిప్పుడే పంట చేతి కొస్తుంది. వర్షాలు సమృద్ధిగా కురవడం, నల్లరేగడి భూములు ఉండడంతో వడ్డేపల్లి, మానవపాడు, ఉండవల్లి మండలంలో కొన్ని గ్రామాలకు తుమ్మిళ్ల సాగునీరు కూడా అందడంతో పొగాకు పంటలు ఏపుగా పెరిగాయి. ఇటిక్యాల, ధరూరు, కేటీదొడ్డి, గట్టు, అయిజ మండలాల్లో సాగు పెరిగింది. ఎకరం పది నుంచి 15క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన ఎకరంపై కనీసం రూ.50వేల దాక లాభం రావచ్చన్న ఆశతో రైతులు ఉన్నారు.

పంటలపై తుఫాన్ ప్రభావం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల సంభవించిన తుఫాన్ ప్రభావం జిల్లాలో కూడా కనిపిస్తుంది. ఈ పెంగల్ తుఫాన్‌తో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్‌లో సాగుచేసిన పొగాకు పంటలు చేతికొచ్చాయి. కొంతమంది పండుటాకులుగా మారిన 40శాతం పంటను కోసి తోరణాలు కట్టి ఆరబెట్టారు. వర్షానికి తడవకుండా రైతులు టార్పాలీన్లు కప్పారు. అయినా ముసురుతో పొగాకు బూజు వస్తుందేమోనని భయపడుతున్నారు. మరికొంతమంది రైతులు కోతకోసిన పొలంలో ఉండగానే ముసురు పట్టుకుంది. పొగాకు వానకు తడిస్తే దెబ్బతినే అవకాశం ఉందని పలు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.

కొంటారా.. కొర్రీలు పెడతారా?

గతేడాది ఖరీఫ్ ముందు క్వింటాల్ రూ.16వేల నుంచి రూ.20వేల దాక కొంటామని రైతులతో నమ్మబలికి వందల ఎకరాల్లో పలు కంపెనీల వారు సాగు చేయించారు. వారి మాటలు నమ్మిన రైతులు జిల్లా వ్యాప్తంగా 18వేల ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. యాసంగిలో సాగు చేసిన పొగాకు దిగుబడులకు కొర్రీలు పెట్టి వెనక్కు పంపాయి. గతేడాది ఓ కంపెనీ మొదట్లో ప్రతినిధులను ఏర్పాటు చేసి ఊరురా తిప్పి, స్థానికంగా పాయింట్లు పెట్టి కొంటామని వందల ఎకరాల్లో సాగు చేయించారు. పంట చేతి కొచ్చే సరికి కొనుగోలు కేంద్రాలను ఎత్తేసి కర్నూలు జిల్లా లోని మిద్దూరుకు తీసుకువస్తేనే కొంటామని తేల్చేశారు. తీరా అక్కడికి వెళ్లాక వివిధ కారణాలతో ధరలో వ్యత్యాసాలు చూపడం, ఇదేమంటే రిజెక్ట్ చేస్తామని బెదిరించారని రైతులు వాపోయారు. అంతదూరం వెళ్లి తిరిగి రాలేక, వారు చెప్పిన ధరకే అమ్ముకున్నారు. ఈ ఏడాది సాగు, దిగుబడులు పెరిగాయి. ఇంతలోనే తుఫాన్ ప్రభావంతో కంపెనీలు ఎన్ని కొర్రీలు పెడతాయోనని రైతులు ఒకింత ఆందోళనలో ఉన్నారు.

పంటను కాపాడుకుంటున్నాం



పంట చేతికొచ్చిన దశలోనే వర్షం రావడం ఇబ్బందికరంగా మారింది. ఇటీవల పండిన పంటను కోసి తోరణాలు కట్టి ఉంచాం. ఇంతలోనే వర్షం రావడంతో టార్పాలిన్లతో కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాం. కంపెనీలు టార్పాలిన్లు ఇస్తే బాగుంటుంది.

- వెంకటేశ్వర్లు, పొగాకు రైతు, చెన్నిపాడు

జాగ్రత్తలు పాటించాలి



ముసురు వర్షాలకు పొగాకు రైతులు జాగ్రత్తలు పాటించాలి. తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలి. తడిసినా పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉండదు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వరి రైతులు తుఫాన్‌పై జాగ్రత్తగా ఉండాలి.

- సక్రియనాయక్, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ సంచాలకుడు, గద్వాల

అక్షర ప్రగతిలో ఎందాక అడుగులు

● నేడు ఎన్ఏఎస్ పరీక్ష



శిక్షణకు హాజరైన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (ఫైల్)

అయిజ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ 2017, 2022లో నిర్వహించిన జాతీయ సాధన సర్వే (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)లో ఇతర జిల్లాలతో పోలిస్తే జోగుళాంబ గద్వాల జిల్లా వెనుకబడినట్లు తేలింది. గత ఫలితాలు విద్యాశాఖలో ఆందోళన రేకెత్తించాయి. అక్షరాలు గుర్తించలేని స్థితిలో ఉన్నారని తెలుసుకున్నారు. ప్రధానంగా ఆంగ్లం, గణితంలో పూర్తిగా వెనుకబడి ఉన్నారని గ్రహించారు. ఈ నేపథ్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బుధవారం విద్యార్థులకు మరో సారి నాస్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎంపిక చేయబడిన ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ప్రతి రోజు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. మాదిరి ప్రశ్నాపత్రాలతో మూడు దఫాలుగా పరీక్షలు నిర్వహించారు.

జిల్లా వ్యాప్తంగా 84 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న విద్యార్థులు

జోగుళాంబ గద్వాల జిల్లాలో మూడవ తరగతి చెందిన 6,166, ఆరవ తరగతికి చెందిన 5,272, తొమ్మిదవ తరగతికి చెందిన 6,248 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. 84 ఎంపిక చేయబడిన ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇందులో మూడో తరగతి విద్యార్థులకు గణితం, పరిసరాల విజ్ఞానం, ఆరు, తొమ్మిదవ తరగతి విద్యార్థులకు గణితం, సామాన్య సాంఘిక శాస్త్రంపై పరీక్ష రాయనున్నారు. వీరికి 1:30 గంటల సమయం కేటాయింబడుతుంది. తొమ్మిదవ తరగతి విద్యార్థులకు మాత్రం రెండు గంటల సమయం ఉంటుంది. ఇప్పటికే పరీక్ష నిర్వహణకు అవసరమైన వలంటీర్లను, పర్యవేక్షకులకు శిక్షణ పూర్తి చేశారు. పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నామని అయిజ ఎంఈవో రాములు తెలిపారు. ఎంపిక చేయబడిన కేంద్రాల్లో ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందని, ఒక పరిశీలకుడు, ఫీల్డ్ ఇన్‌స్ట్రక్టర్ ఉన్నట్లు ఎంఈవో పేర్కొన్నారు.

అభివృద్ధి చేస్తే.. డిండి అద్భుత పర్యాటకం

● అందుబాటులో తొమ్మిది ఎకరాల టూరిజం శాఖ భూములు

● ఇటీవల రూ.5 కోట్లు మంజూరు



డిండి ప్రాజెక్టు వద్ద కిందకు జాలువారుతున్న నీరు (ఫైల్)

అచ్చంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాలకు 765వ నెంబర్ జాతీయ రహదారి వెంట దుందుబీ నదిపై నిర్మించిన డిండి ప్రాజెక్టును అభివృద్ధి పరిస్తే పర్యాటకంగా ఎంతో మేలు కలుగుతుంది. ప్రాజెక్టు సమీపంలో దాదాపు తొమ్మిది ఎకరాల భూమి టూరిజం శాఖకు ఉన్నా.. అది నిరుపయోగంగానే ఉంది. శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారి ప్రాజెక్టు సమీపం నుంచే వెళ్తుండటంతో నిత్యం యాత్రికులు ఇక్కడ కొద్ది సేపు సేద తీరుతుంటారు. వర్షాకాలంలో డిండి ప్రాజెక్టు పరవళ్లు తొక్కితే అందాలను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. ప్రాజెక్టులో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోటింగ్ ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉంటాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ప్రాజెక్టు కట్ట కూడివైపున కొలువైన కట్ట మైసమ్మను దర్శించుకునేందుకు ప్రతీ ఆదివారం భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో జిల్లా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం ఇటీవల రూ.25కోట్లు మంజూరు కాగా, డిండి ప్రాజెక్టులో బోటింగ్, పర్యాటక అభివృద్ధి కోసం రూ.5కోట్లు మంజూరైనట్లు ఇటీవల ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రకటించారు.

పబ్బతి అంజన్న ఉత్సవాలకు సీఎంకు ఆహ్వానం



సీఎంకు పబ్బతి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు

పదర , డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం మద్దిమడుగు పబ్బతి అంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఆహ్వానం పలికింది. ఈ సందర్భంగా సీఎంకు ఆలయ కమిటీ చైర్మన్ శాలువా కప్పి సత్కరించారు. వేదపండితులు, అర్చకులు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని బహూకరించి ఆహ్వాన పత్రికను అందజేశారు. రంగాచారి, అర్చకులు వీరయ్య శాస్త్రీ, రఘుశర్మ, నాయకులు చత్రునాయక్, వెంకట్రామ్ నాయక్, హన్మంత్ నాయక్ ఉన్నారు.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

చిన్నచింతకుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ఓ యువకుడు నొప్పిని భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని మద్దూరులో ఈ సంఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గువ్వల చెన్నాయుడు, మనెమ్మల కుమారుడు గువ్వల విజయ్‌కుమార్ (17) ఆరు నెలలుగా బ్రెయిన్ ట్యూబర్‌తో బాధ పడుతున్నాడు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న ఆయన నొప్పి భరించలేక మంగళవారం ఉదయం కుటుంబసభ్యులందరూ పొలం పనులకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న విజయకుమార్ పురుగుల మందు తాగాడు. ఇరుగుపొరుగు వారు గమనించి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక..

వడ్డేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరా లిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పైపాడుకు చెందిన కురువ కృష్ణ (42) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి తీవ్రం కావడంతో భరించలేక మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకు న్నాడు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

గోపాల్‌పేట. డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం, మున్ననూరు గ్రామంలో ఓ మహిళ విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వలిగి యాదమ్మ (41) భర్త సాయిలు రెండు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఆమె కూలి పని చేసుకుంటూ, ఇద్దరు కుమారులతో కలిసి గ్రామంలోనే జీవిస్తోంది. మంగళవారం ఉదయం ఇంటికి విద్యుత్ సరఫరా చేసే తీగ కిందికి వేలాడుతూ కనిపించింది. ఆమె తీగను పైకి ఎత్తేందుకు యత్నిస్తుండగా, సపోర్ట్‌గా ఉన్న జేవైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నందిన్నెలో ఎక్సైజ్ అధికారుల దాడులు

▸▸ రెండు కిలోల సీహెచ్ పట్టివేత

గద్వాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, నందిన్నె గ్రామంలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన బోలప్ప ఇంట్లో రెండు కిలోల సీహెచ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ గణపతి రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా బోలప్ప ఇంట్లో సీహెచ్ లభించిన మాట వాస్తవమేనని తెలిపారు. మరికొంత సీహెచ్‌ను పొలంలో దాచినట్లు సమాచారం ఉండటంతో, సిబ్బంది వెతుకుతున్నట్లు చెప్పారు. కాగా సీహెచ్ వ్యాపారం చేస్తున్న వ్యక్తులు ప్రధాన నాయకుడి అనుచరులుగా ఉండటంతో మంత్రి ద్వారా అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. అధిక మొత్తంలో సీహెచ్ లభించినా, తక్కువగా చూపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేర్వేరు గ్రామాల్లో ఇద్దరు మహిళల అదృశ్యం

మహబూబ్‌నగర్, హన్వాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్ నగర్ జిల్లాలో వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని అప్పన్నపల్లికి చెందిన పోలెమోని చంద్రమ్మ (52) గత నెల 30న మేకలు కాయడానికి వెళ్ళి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త భీమయ్య మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హన్వాడ మండలంలోని వెంకటమ్మకుంట తండాకు చెందిన ఇస్లావాత్ మన్నిబాయి (48) ఈ నెల ఒకటిన పొలానికి వెళ్లి తిరిగి రాలేదు. రెండు రోజులైనా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో భర్త వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

మదనాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో ఏడాది క్రితం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఏదుట్ల గ్రామానికి చెందిన దినేష్ పట్టుబడ్డాడు. అతడిని మంగళవారం వనపర్తి కోర్టులో హజరు పరచగా న్యాయాధికారి ఆరు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కస్తూర్బాలో బియ్యం పక్కదారి

▸▸ ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్న స్థానికులు


బియ్యం అక్రమ రవాణాపై విచారణ నిర్వహిస్తున్న ఎంఈవో

బిజినేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం నుంచి బియ్యం పక్కదారి పడుతోంది. పాఠశాల నుంచి అక్రమంగా బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా, స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఆటోను స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేశారు. మండల విద్యాధికారి రఘునాథశర్మకు సమాచారం అందించారు. దీంతో ఆయన కస్తూర్బా పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వంట మనుషులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో బియ్యం నిల్వను పరిశీలించారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా బియ్యాన్ని ఎందుకు తరలిస్తున్నారో వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ ఎస్‌వో నాగలక్ష్మికి నోటీసు ఇచ్చారు.

మిషన్ భగీరథతో స్వచ్ఛమైన నీటి సరఫరా

▸▸ అవగాహన సదస్సులో ఎస్ఈ వెంకటరమణ

గద్వాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన నీటి సరఫరా చేస్తున్నట్లు ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు 120 మంది హెల్పర్లు, నీటి సరఫరా సహాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ మంచినీటి క్లోరినేషన్ ప్రక్రియను వివరించారు. మిషన్ భగీరథ పథకం వచ్చిన తర్వాత ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందుతోందని, దీంతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడిందని తెలిపారు. ఓహెచ్ఎస్ఆర్‌లను శుభ్రం చేయడం, చేతిపంపులు, సింగిల్ మోటార్ పరికరాలు, త్రీఫేస్ మోటార్ల మరమ్మతుపై శ్రద్ధ వహించాలని సూచించారు. నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ నెల ఐదవ తేదీన గ్రామీల్లో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకొని పరిష్కారించాలన్నారు. సమావేశంలో ఈఈ లు భీమేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


అల్పాహారం స్వీకరిస్తున్న స్వాములు

దాతల సహకారం..

స్వాముల సంకల్పం

▸▸ అయ్యప్ప మాలధారులకు రాత్రి వేళ అల్పాహారం ▸▸ ఆకలి తీరుస్తున్న అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి

▸▸ పనుల మీద పట్టణానికి వచ్చే వారికి ఎంతో ఉపయోగం

మహబూబ్‌నగర్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : స్వాములు సంకల్పించారు.. దాతలు సహకరిస్తున్నారు.. వెరసి ప్రతీ రోజూ ఎంతో మంది అయ్యప్ప మాల ధారులకు అల్పాహారం ఉచితంగా అందుతోంది. ఏటా కార్తీకమాసం నుంచి మకర సంక్రాంతి వరకు అయ్యప్ప స్వామి భక్తులు మండల దీక్ష చేపడతారు. 41 రోజుల పాటు ఎంతో నిష్ఠతో దీక్షను కొనసాగించే స్వాములకు మధ్యాహ్నం వేళ ఎక్కడో ఒకచోట భిక్ష (మధ్యాహ్న భోజనం) లభిస్తోంది. అయితే వివిధ పనులపై మహబూబ్‌నగర్ పట్టణానికి ప్రతీ రోజు ఎంతో మంది స్వాములు వస్తూ ఉంటారు. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారికి ఒక్కోసారి పట్టణంలోనే ఆలస్యంవుతోంది. వారికి రాత్రి వేళ అల్పాహారం లభించడం కష్టం. దీంతో వారు పస్తులుండాల్సి వస్తోంది.


అయ్యప్ప స్వాములకు అల్పాహారం వడ్డిస్తున్న దీక్షా సమితి సభ్యుడు

అల్పాహార వితరణ కార్యక్రమం ప్రారంభించిన తొలి రోజు 70 మంది స్వాములు అల్పాహారం స్వీకరించారు. క్రమంగా స్వాముల సంఖ్య పెరిగింది. 20 రోజులు గడవక ముందే వీరి సంఖ్య ఐదు వందల మందికి చేరింది. అమావాస్య అన్నదాన మండపం ప్రధాన రహదారి పక్కనే ఉండటం, పక్కనే జలసౌధ కార్యాలయం సెల్లార్‌లో వెయ్యి మంది వరకు కూర్చొని భోజనం చేసే స్థలం ఉండటం స్వాములకు సదుపాయంగా ఉంది. రోజుకో రకమైన అల్పాహారంతో పాటు స్వీటు కూడా ఇస్తున్నారు. అలాగే ఉదయం వేళ టీ, కాఫీ కూడా అందిస్తున్నారు. అ సమయంలోనే రాత్రి అల్పాహారం కోసం టోకెన్లు ఇస్తారు. టోకెన్లు తీసుకున్న వారి సంఖ్యను బట్టి అల్పాహారాన్ని సిద్ధం చేస్తున్నారు. ప్రతీ రోజు వెయ్యి మందికైనా అల్పాహారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని నిర్వాహకులు చెప్తున్నారు. భజరంగదళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు, సభ్యులు స్వాములకు అవసరమైన సేవలు అందిస్తున్నారు.

ప్రతీ రోజు 500 మంది స్వాములకు అల్పాహారం

గత నెల ఆరున ప్రారంభం

అల్పాహారం కోసం స్వాములు పడుతున్న ఇబ్బందులను అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి నిర్వాహకులు గమనించారు. మండల దీక్షలో ఉన్న స్వాములకు అల్పాహారాన్ని ఉచితంగా అందించాలని సంకల్పించారు. అనుకున్నదే తడవుగా కొందరు బృందంగా ఏర్పడి తలా కొంత డబ్బును పోగు చేశారు. అలాగే పట్టణంలో దాతలను సంప్రదించి, తమ సంకల్పాన్ని వివరించారు. దీంతో దాతలు ఒక్కొక్కరుగా ముందుకు వచ్చి, తమ వంతు సాయం అందించారు. పాలమూరు పట్టణంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో ఉన్న అయ్యప్ప అన్నదాన మండపంలో గత నెల ఆరున అల్పాహార వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఈ నెల 29 వరకు, అంటే 54 రోజుల పాటు కొనసాగనున్నది. ఇప్పటికే అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో రెండేళ్లుగా ప్రతీ నెల అమావాస్య రోజు ప్రజలందరికీ అన్నదానం చేస్తున్నారు. అందుకోసమే ప్రత్యేకంగా అమావాస్య అన్నదాన మండపాన్ని ఏర్పాటు చేశారు.



అల్పాహారం దొరకక ఇబ్బంది పడేవాళ్లం

కాల రాంచంద్రయ్య, గురుస్వామి : ఎన్నో సంవత్సరాల నుంచి మాలధారణ చేస్తున్నాను. పనిమీద హైదరాబాద్, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్లి వచ్చేటప్పుడు రాత్రివేళ ఎక్కడా అల్పాహారం దొరికేది కాదు. ఇలా ఎన్నోసార్లు పండ్లు తిని, నీళ్లతో కడుప ్నింపుకున్న రోజులున్నాయి. ఇకపై ఎవరూ అలాంటి బాధలు పడొద్దనే ఆలోచనతో ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయం. ఎంతమంది స్వాములు వచ్చినా, లేదనకుండా అల్పాహారం అందించడం అభినందనీయం.

ఎంతమందికైనా అల్పాహారం



ఎంత మంది స్వాములు వచ్చినా, లేదనకుండా ప్రతీ రోజు అల్పాహారం అందిస్తాం. ప్రతీ రోజు ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల మధ్య టీ, కాఫీ కూడా ఇస్తున్నాం. ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల మధ్య టీ, కాఫీ అందిస్తున్నాం. టోకెన్ తీసుకున్న వారి సంఖ్యకు అనుగుణంగా అల్పాహారం సిద్ధం చేస్తాం. ఈ కార్యక్రమాన్ని ప్రతీ సంవత్సరం కొనసాగిస్తాం.

\- సీమ నరేందర్, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచారసమితి అధ్యక్షుడు

ఉమ్మడి పాలమూరులోనే మొదటి సారి..



స్వాములకు రాత్రి వేళ అల్పాహారం అందించే కార్యక్రమం ఉమ్మడి పాలమూరులో ఇదే మొదటి సారి. మా సంకల్పానికి దాతలు సహకరిస్తున్నారు. క్రమం తప్పకుండా మాల ధరిస్తున్న మాకు స్వాముల బాధలు తెలుసు. చాలా మంది స్వాములు రాత్రివేళ వండుకోలేక నీళ్ళు తాగి పడుకున్న సందర్భాలు మాకు తెలుసు. అందుకే అందరి సహకారంతో కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం.

\- ఆరేళ్ళ రమేశ్, గురుస్వామి

చాలా గొప్ప సంకల్పం



అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచారసమితి సంకల్పం చాలా గొప్పది. దాతలు సహకరించడం మరింత గొప్ప విషయం. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వచ్చిన స్వాములందరికీ అల్పాహారం ఇస్తున్నారు. ఈ విషయం సంగతి తెలిసి పట్టణం పట్టణ నలుమూలల నుంచే కాకుండా, వివిధ పనులపై పాలమూరకు వచ్చే వారు, ప్రయాణికులు, కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారు.

\- బాలయ్య కోట్ల

బంగ్లాదేశ్ హిందువులకు అండగా నిలవాలి

▸▸ హిందూ ఐక్య వేదిక ప్రతినిధుల పిలుపు

▸▸ పాలమూరు పట్టణంలో భారీ ర్యాలీ




ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న హిందూ సంఘాల ప్రతినిధులు, ర్యాలీలో నినాదాలు చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను యావత్ సమాజం ముక్తకంఠంతో ఖండించాలని, వారికి అండగా నిలవాలని హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, స్వామీజీల అక్రమ అరెస్టులను నిరసిస్తూ మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం నుంచి ప్రారంభమైన ర్యాలీ న్యూటౌన్ చౌరస్తా మీదుగా అంబేడ్కర్ చౌరస్తా, అశోక్ టాకీస్ చౌరస్తాల నుంచి క్లాక్ టవర్ చౌరస్తాకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ ఇస్కాన్ సంస్థ బంగ్లాదేశ్‌లోని నిరుపేదల కడుపు నింపుతోందన్నారు. దీనిని ద్రోహంగా పరిగణించిన ఆ ప్రభుత్వం స్వామీజీలను అరెస్ట్ చేసి జైల్లో పెట్టి హింసిస్తోందని ఆరోపించారు. స్వాములను విడుదల చేసే వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం వెంటనే స్పందించి వారి విడుదలకు కృషి చేయాలని కోరారు. అందుకోసం హిందువులందరూ సంఘటిత దీక్షలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆదనపు కలెక్టర్ శివేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ర్యాలీలో ఐక్యవేదిక కన్వీనర్ సీమ నరేందర్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా సంచాలక్ వసంతం వెంకటేశ్, ఇస్కాన్ జిల్లా ప్రతినిధులు కొండన్న, రాజు, మల్లేష్, మెట్టుకాడి శ్రీనివాస్, కుర్మన్న, పడాకుల అంజయ్య, సతీష్ కుమార్, రెబ్బ విగ్నేష్, రఘుశర్మ, శివ నాగలక్ష్మి, గాయత్రి, మయూరీ నాథ్, కంచి కామకోటి మఠం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

మూసాపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులను భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. మూసాపేట ఎస్ఐ పి.శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం మహ్మద్‌హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన గీత (24)కు ఆరేళ్ల క్రితం కంతుల ప్రకాశ్‌తో వివాహం కాగా, హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండు వారాల క్రితం గీత భర్త, పిల్లలతో కలిసి గ్రామానికి వచ్చారు. వారం క్రితం తల్లిదండ్రులు వారికి ఒడి బియ్యం పోశారు. ఆ తర్వాత కుటుంబంలో కలతలు వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం గీత స్నా నాల గదిలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. సంఘటనపై మృతురాలి తల్లి సుశీల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకుంటాం

▸▸ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్


బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేస్తున్న మహేష్ కుమార్ గౌడ్

అలంపూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చి రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకుంటామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్‌లో గల బాల బ్రహ్మేశ్వర స్వామిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ సభ్యుడు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికి భారీ ర్యాలీగా వెళ్లారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు, ఈవో పురేందర్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. ఆ తర్వాత హేమలాపురి వసతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటి సారి అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల్లో వాగ్దానాల పేరిట ఊరడింపు తప్పా, ఏమీ చేయలేదన్నారు. వారు చెప్పుకున్నది రూపాయి అయితే, చేసింది చారాణ మాత్రమేనని విమర్శించారు. దానికి భిన్నంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సంవత్సరంలోనే అభివృద్ధి చేసిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబ సభ్యులకు తప్పా ఎవరికీ ఉద్యోగాలు రాలేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని చెప్పారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

చట్టవిరుద్ధంగా పేలుడు పదార్థాల నిల్వ

▸▸ శ్రీకృష్ణ స్టోన్ క్రషింగ్ కంపెనీలో పోలీసుల తనిఖీ

▸▸ సైట్ మేనేజర్‌పై కేసు నమోదు


పేలుడు పదార్థాలను పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు

గండీడ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చట్టవిరుద్ధంగా నిల్వ చేసిన పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహబూబ్ నగర్ జిల్లా, గండీడు మండల పరిధిలోని గోవిందుపల్లి గ్రామ శివారులో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులో శ్రీకృష్ణ స్టోన్ క్రషింగ్ కంపెనీ అనుమతులతో కొనసాగుతోంది. కానీ కంపెనీ నిర్వాహకులు పేలుడు పదార్థాలను ఎలాంటి జాగ్రత్తలూ పాటించకుండా, అజాగ్రత్తగా నిల్వ చేశారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందడంతో మంగళవారం క్రషింగ్ కంపెనీలో తనిఖీలు నిర్వహించారు. అక్కడున్న ఓ గదిలో నిర్లక్ష్యంగా నిల్వ చేసిన పేలుడు పదార్థాలను గుర్తించారు. ఐడియల్ పవర్ - 90 స్టిక్స్ 12 కార్టన్లు, 400 విడి ప్యాకెట్లు, ఆరు కార్టన్ల విద్యుత్‌తీగలు, డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నారు. సైట్ మేనేజర్ శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు, ఎక్సిసిస్ ఏజెన్సీస్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

వాతావరణ మార్పులతో వ్యాధులకు అవకాశం

- సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభు



అచ్చంపేటటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముసురు వర్షాలతో వాతావరణంలో మార్పులు రావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభు అన్నారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు పేర్కొన్నారు.

దవాఖానలో ప్రజలకు ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు?

ప్రస్తుతం అన్ని రోగాలకు వైద్యం అందిస్తున్నాం. ఆసుపత్రిలో 40 మంది స్టాఫ్ నర్సులతో ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్యం అందిస్తున్నాం.వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాం. ఆర్థో వైద్యులు లేకపోవడంతో ప్రస్తుతం అలాంటి కేసులను జిల్లా ఆసుపత్రికి పంపిస్తున్నాం. ఆసుపత్రిలో డయాలసిస్ కేసులు రోజుకు 18 నుంచి 20 చేస్తున్నాం.

కాన్పుల కోసం వచ్చేవారికి సౌకర్యాలు ఎలా ఉన్నాయి ?

సివిల్ ఆసుపత్రికి గర్భిణులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం. గత నెలలో 60 ఆపరేషన్లు, 24 నార్మల్ డెలవరీలు చేశాం. గైనకాలజీ వైద్యులు లేకున్నా ఆసుపత్రిలో కాన్పుల కోసం వచ్చేవారికి సకాలంలో వైద్యం అందిస్తున్నాం.

ఈ సీజన్‌లో ఏయే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది, నివారణ చర్యలేంటి?

ప్రస్తుతం జ్వరంతో పాటు విరేచనాలు, దగ్గు, జలుబు వంటి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ముఖ్యంగా పరిశుభ్రత పాటించాలి. పరిశుభ్రమైన ఆహారంతో పాటు కాచి వడబోసిన నీటిని తాగాలి. చలి తీవ్రత అధికంగా ఉన్నందున తప్పనిసరి ఉన్ని దుస్తులు ధరించాలి. మాస్కులు, స్వెటర్లు ధరించాలి.

పాము కాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉందా ?

ఆసుపత్రిలో పాము కాటు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. పాము కాటు వ్యాక్సిన్‌తో పాటు కుక్క కాటుకు కూడా ఉంది.

మంద కృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సౌట కాశీం

అచ్చంపేటటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సౌట కాశీం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 ఏళ్లుగా అణగారిన వర్గాల తరఫున పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగను విమర్శిస్తే సహించేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొంతమంది మాలలు కులాన్ని అడ్డంపెట్టుకొని గల్లీలీడర్లు మందకృష్ణను విమర్శించే స్థాయి వారికి లేదన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

మన్ననూర్ : డిసెంబరు 1న జరిగిన మాలల సింహగర్జనలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు సరైనవి కావని మాదిగ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు భరత్ మాదిగ ఖండించారు. అమ్రాబాద్ మండలం ప్రశాంత్‌నగర్ గ్రామంలో ఎంఎస్ఎఫ్ కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలకు అందాల్సిన హక్కులపై వాణిని వినిపించాల్సిన నాయకులు తమ నాయకుడిని వ్యక్తిగతంగా విమర్శించడం సరైన పద్ధతి కాదన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్‌వెంకటయ్య, బాబు, కృష్ణయ్య, పరమేశ్వర్, చంటి పాల్గొన్నారు.

ప్రీమియర్ షోల పేరుతో సినిమా టికెట్ ధరలు పెంచొద్దు

- డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు మధు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రీమియర్ షోల పేరుతో సినిమా టికెట్ల ధరలు పెంచొద్దని డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు నాగపూర్ మధు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాయంలో డీవైఎఫ్ఐ నాగర్‌కర్నూల్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 5న విడుదల కానున్న పుష్ప-2 సినిమాకు ప్రీమియర్ షో పేరుతో ఒక్క రోజు ముందు టికెట్ ధరను రూ.800కు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. అదేవిధంగా డిసెంబరు 5 నుంచి టికెట్ ధరను 200 నుంచి 300 రూపాయలకు అమ్ముకోవచ్చని సినిమా పరిశ్రమ పెద్దలకు అనుమతి ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శివ, మహేష్, సుల్తాన్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈకి సన్మానం

తిమ్మాజిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఇటీవల ఏఈగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌ను మంగళవారం సంబంధిత కాంట్రాక్టర్లు శ్రావణ్ కుమార్‌రెడ్డి శ్రీనివాసులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటుగా సింగిల్ విండో డైరెక్టర్ శ్రీరామ్, కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌గౌడ్‌లు శాలువాలు కప్పి పూల బొకేను అందజేసి అభినందనలు తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను తరచుగా కొనసాగుతున్న విద్యుత్ అంతరాయాలను ఏఈకి వివరించారు. విద్యుత్ సబ్ ఇంజనీర్ తరుణ్ ఉన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోని ఎమ్మార్సీ కార్యాలయం

- ఎమ్మార్సీని ఎంపీడీవో కార్యాలయం చేయాలని ప్రజల కోరిక

ఊర్కొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మండల వనరుల కేంద్రం నిర్మాణం చేపట్టి మూడేళ్లవుతున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు లేక ఇరుకైనా, ప్రైవేటు భవనాల్లో కొనసాగుతుండగా వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలకు కూర్చోవడానికికాదుకదా, నిలబడటానికి సైతం జాగాలేని పరిస్థితి. ఇది గ్రామ చివరన ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలతో పాటు మద్యం ప్రియులకు నిలయంగా మారింది. ఎంపీడీవో కార్యాలయంలోనే ఎంఈవో కార్యాలయం కొనసాగుతుండడంతో అధికారులు, సిబ్బంది అక్కడే ఉంటున్నారు. ఉపాధ్యాయుల సమావేశాలు, విద్యాబోధన తీరుతెన్నులపై చర్చించాల్సిన ఎమ్మార్సీ భవనం ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు చేరేలా ఉంది.



ఊర్కొండలో ప్రారంభానికి నోచుకోని మండల వనరుల కేంద్రం

ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు చేయాలి



మండల వనరుల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంగా ఏర్పాటు చేసి, ప్రారంభించాలి. దీనివల్ల ప్రజలతో పాటు ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు సౌకర్యంగా ఉంటుంది. స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి దీనిపై దృష్టి సారించాలి.

- దారా రాజు, ఊర్కొండ

ఉన్నతాధికారులకు విన్నవించాం



మండల వనరుల కేంద్రం ప్రారంభించాలని ఉన్నతాధికారులకు తెలియజేశాము. ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసుకోవాలంటే కొంత ఇబ్బందిగానే ఉంది. భవనం ప్రారంభించి వాడుకలోకి తీసుకువస్తే బాగుంటుందని మా విన్నపం

- మురళీమోహన్‌గౌడ్, ఎంఈవో

ఎంపీడీవో కార్యాలయం చేయాలి

మండల వనరుల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంగా ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులను మండల ప్రజలు కోరుతున్నారు. మండల విద్యాశాఖ అధికారిగా ఊర్కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నందున, ఆయన పాఠశాల నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. మండల వనరుల కేంద్రాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంగా ఏర్పాటు చేస్తే వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, ఆ దిశగా ఎమ్మెల్యే జనంపల్లి అనరుధ్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైకల్యం శరీరానికే తప్ప..

సంకల్పానికి కాదు

- కలెక్టర్ బదావత్ సంతోష్

- దివ్యాంగుల దినోత్సవంలో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డితో కలిసి పాల్గొన్న కలెక్టర్



దివ్యాంగుడికి ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

నాగర్‌కర్నూల్/ తిమ్మాజిపేట/ లింగాల/ కోడేరు/ పెద్దకొత్తపల్లి/ వెల్దండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులుల మనోధైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని, పూర్తిస్థాయిలో అండగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పని చేస్తుందని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సాయి గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఇద్దరు దివ్యాంగులకు లాప్‌ట్యాప్‌లను, రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో మొదటి, రెండవ స్థానాల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. జిల్లాలో 21794 మంది వివిధ లోపాల దివ్యాంగులు ఉన్నారని, 12,777మంది దివ్యాంగులకు ప్రభుత్వం నుండి రూ.4016 పింఛన్ అందుతోందని తెలిపారు. ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇల్లు నాగర్‌కర్నూల్ పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసే లేఅవుట్లలో స్థలాలను కూడా దివ్యాంగులకు కేటాయించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా డీడబ్ల్యూవో రాజేశ్వరి, డీఆర్‌డీఏ అదనపు పీడీ లక్ష్మీనారాయణ, సమగ్ర శిక్ష అభియాన్ కో ఆర్డి నేటర్ బరపటి వెంకటయ్య, జిల్లా క్రీడల అధికారి సీతారాంనాయక్, రాష్ట్ర, జిల్లా స్థాయి దివ్యాంగ నాయకులు కందనూలు నిరంజన్, రాజశేఖర్, శ్రీశైలం, శంకర్, రవి పాల్గొన్నారు. ● తిమ్మాజిపేట జడ్పీహెచ్ పాఠశాలలో ఎంఈవో సత్యనారాయణశెట్టి ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ప్లేట్లు, పెన్నులు వంటి బహుమతులు అందజేశారు.

● లింగాల ఎమ్మార్సీ కార్యాలయంలో దివ్యాంగులతో ఎంఈవో బషీర్ అహ్మద్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పీఎస్ లింగాల ఉపాధ్యాయులు శంకర్, సుశీల, సీఆర్పీ హరిలాల్, కో ఆర్డినేటర్ సాయికుమార్, ఐఆర్పీ కృష్ణయ్య పాల్గొన్నారు.

● కోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసినట్లు ఎంఈవో భాస్కర్‌శర్మ తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ తరఫున బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు కృష్ణయ్య, క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపకులు రాఘవేందర్, పి.చంద్రశేఖర్, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి ఎమ్మార్సీ కార్యాలయంలో బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేసినట్లు ఎంఈవో కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు రాంపాల్, ఐఆర్పీ టీచర్లు నిరంజన్, స్వర్ణలత, ఎమ్మార్సీ సిబ్బంది శివలింగం, స్వామి పాల్గొన్నారు.

● వెల్దండ మండలంలోని దివ్యాంగ విద్యార్థులకు ఎంఈవో చంద్రుడు ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రవీందర్, రాజశేఖర్ ఉన్నారు.

జిల్లాకు శ్రీకాంతాచారి పేరు పెట్టాలి

- వర్ధంతిలో విద్యార్థుల డిమాండ్



పెద్దకొత్తపల్లిలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కొల్లాపూర్/ పెద్దకొత్తపల్లి/ కోడేరు/ వెల్దండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మలి దశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరవీరుడు కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతిని మంగళవారం కొల్లాపూర్ పాలమూరు యూనివర్సిటీ పీజీ సెంటర్‌లో విద్యార్థులు నిర్వహించారు. విద్యార్థులు భరత్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కాసోజు శ్రీకాంతాచారి తమ ప్రాణాలను పణంగా పెట్టి సీమాంధ్ర పాలకుల నిరంకుశ తీరును ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. 2009 డిసెంబరు 3న కాసోజు శ్రీకాంతాచారి తాను ఆత్మబలిదానం చేసుకొని తెలంగాణ ఉద్యమా నికి ఊపిరిపోశారన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి విద్యార్థులు నివాళులర్పించారు. శ్రీకాం తాచారి గుర్తింపుగా రాష్ట్రంలో ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు మహేష్, భరత్, రాము, ప్రకాష్, వంశీ యాదవ్, స్వాతి, రాజేశ్వరి, అమరగిరి భరత్ యాదవ్ పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి 25వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు బ్రహ్మం, మాజీ ఎంపీటీసీ నరసింహ, మాజీసర్పంచు సత్యం నివాళి అర్పించారు.

● కోడేరులో మండల మాజీ కోఆప్షన్ ఎస్‌కె కరీం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

● వెల్దండలో శ్రీకాంతాచారి వర్ధంతిని మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్ ముదిరాజ్, నిరంజన్, లింగం, ప్రసాద్, శ్రీనివాస్, రవిగౌడ్, హన్మంతు, గంగాధర్, నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం

- మునిసిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య వెల్లడి



కొల్లాపూర్‌లో దివ్యాంగురాలిని సన్మానిస్తున్న మునిసిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య

కొల్లాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలో ప్రజా పాలన సంబరాలు మంగళవారం నిర్వహించారు. కొల్లాపూర్ మునిసిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య కమిషనర్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తు ర్యాలీని నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా సంఘం సభ్యులకు, శానిటేషన్ సిబ్బందికి వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు ఉచిత మందులు అందజేశారు. మహిళా సంఘాలకు మంజూరైన 1,7,36,000 బ్యాంకు రుణాల చెక్కులను మహిళా సంఘాల సభ్యులకు మునిసిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య, కమిషనర్ శ్రీనివాసన్, మునిసిపల్ కౌన్సిలర్లు అందజేశారు. శానిటేషన్ సిబ్బందికి పీపీఈ కిట్స్ అందజేశారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులను శాలువా పూల మాలతో సన్మానించారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

చారకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శంషుద్దీన్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కలల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని సైబర్ మోసగాళ్లు కుచ్చుటోపి పెడుతు న్నారని అన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరచితులతో పంచుకోరాదని అన్నారు. సెల్ ఫోన్‌లో ఓటీపీ, పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే, కేవైసీలను అప్‌డేట్ చేయాలని వచ్చే మెసేజ్‌లకు ఎవరూ స్పందించకూడదని తెలిపారు. డ్రగ్స్‌వాడకం, విక్రయాలపై గట్టి నిఘా ఉంచామని ఎస్ఐ తెలిపారు.

11న కంటి ఆపరేషన్ శిబిరం

కందనూలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ అధికారి కొత్ర బాలాజీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలోని గది నెంబరు 102లో శిబిరం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహించి క్యాటరాక్టు పొర గల వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'సీఎంపై విమర్శలు తగవు'

వంగూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతు పండగ సభలో అన్నదాతల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఇతర ప్రయోజనాలను వివరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అవగాహన లేక ప్రతిపక్ష పార్టీల నాయకులు విమర్శలు చేస్తున్నారని, సరికాదని మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసిందన్నారు. వంగూరు మండలానికి నాల్గో విడత రుణమాఫీలో 1196 మంది రైతులకు గాను రూ.10.84 కోట్లు ముంజూరు అయ్యాయని తెలిపారు.

జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలి : సీపీఎం

తాడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ కోరారు. తాడూరులో సీపీఎం జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ సీపీఎం మూడవ జిల్లా మహాసభలు డిసెంబరు 14, 15వ తేదీల్లో అచ్చంపేట పట్టణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న, మండల కమిటీ సభ్యులు ముచ్చంతల అంజనేయులు, శ్యాంసుందర్, ఎన్నుపోతుల కాశన్న, బాలరాజు, బంగారయ్య, రాములు, చిన్న, మన్యం, శేఖర్ పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు

అచ్చంపేటటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని మునిసిపల్ కమిషనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది తిరుపతయ్య, నిరంజన్, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల జీతాలు చెల్లించాలి

కోడేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పి.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పారిశుధ్య కార్మికులతో కలిసి ఆయన ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అన్నారు. అనంతరం కోడేరులో సీఐటీయూ, ప్రజా సంఘాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ నెల 14, 15 తేదీలలో జరగబోయే సీపీఎం జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులను ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పి.రవి, బుచ్చన్న, వెంకటయ్య, పర్వతాలు, రాములు పాల్గొన్నారు.

సగర సంఘం కమిటీ ఎన్నిక

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దకొత్తపల్లి మండలం సగర సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నీరడి యాదగిరి, మండల కమిటీ అధ్యక్షుడిగా నీరడి శంకర్‌సాగర్, ఉపాధ్యక్షులుగా గుంటి సాయి ప్రకాష్, కొమ్ముల చిత్రనాథ్‌సాగర్, ప్రధాన కార్యదర్శి మొల్ల యాదగిరి సాగర్, సహాయ కార్యదర్శిగా చెంచటి సత్యనారాయణ, కోశాధికారి సత్యపోలు మోహన్‌సాగర్, ప్రధాన కార్యదర్శి గద్దె కురుమయ్యసాగర్‌తోపాటు కార్యవర్గ సభ్యులను మోహన్, ఆవుల శ్రీశైలం, చిలుక సాయిబాబు, ఆవుల లక్ష్మయ్య, గొబ్బూరి కురుమయ్య తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రజాపాలనలో భాగంగా కల్వకుర్తి పట్టణంలో పట్టణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. మునిసిపల్ కార్యాలయంలో మహిళా సంఘాలకు చెక్కులను అందజేశారు. కార్మికులకు నిర్వహించిన హెల్త్ క్యాంపును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తి కావడంపై సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్, వైస్ చైర్మన్ షాహెద్, కమిషనర్ మహమ్మద్ షేక్, మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్ కుమార్, భూపతిరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

- హాజరు కానున్న మంత్రి జూపల్లి

కల్వకుర్తి మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఎమ్మెల్యే కోరారు.

ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించడమే ప్రభుత్వ ధ్యేయమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో మహిళా సంఘాలకు రూ.3 కోట్ల 85 లక్షల 90వేల రుణాలకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలో ప్రతీ కాలనీలో సీసీ రోడ్లు వేస్తున్నామని, త్వరలో 550 పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తామని తెలిపారు. మునిసిపల్ కార్మికులు సేఫ్టీ దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం మునిసి పాలిటీ పరిధిలోని 21వ వార్డులో ఎమ్మెల్యే సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నరేష్‌బాబు, చైర్ పర్సన్ కల్పన, కౌన్సిలర్లు హరిహరన్‌రెడ్డి, తీగల సునేంద్ర, బచ్చన్న యాదవ్, జక్కా రాజవర్ధన్‌రెడ్డి, శ్రీను, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో రక్త పరీక్ష శిబిరం



కొల్లాపూర్ సెయింట్ జోసెఫ్ పాఠశాలలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొల్లాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అయోధ్యలో రామ మందిరం నిర్మాణమై ఏడాది పూర్తయిన సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థల విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రామ మందిరం నిర్మాణం కోసం ఆనాడు ఎంతో మంది తమ ప్రాణాలను అర్పించిన కరసేవకులకు కృతజ్ఞతగా రక్త పరీక్షలు నిర్వహించినట్లు బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ సుంకరి సురేందర్ తెలిపారు. పట్టణంలోని గాయత్రి కళాశాల, సెయింట్ జోసెఫ్ పాఠశాలలో రక్త పరీక్ష శిబిరం ఏర్పాటు చేసినట్లు వివరించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఏ ఒక్క రాజకీయ పార్టీ ఖండించకపోవడంపై హిందువులపై వారికి ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ నాయకులు గోసంరక్షణ సంయోజక్ మహేష్, రవి, భాను, శివ, ఆది, గణేష్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలి



ఏఎస్ఐ బాలునాయక్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పదర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలి అని ఏఎస్సై బాలు నాయక్ అన్నారు. ఆయన మంగళవారం హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా పదోన్నతితో పదర పోలీసు స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన సంఘాల నాయకులు శాలువా కప్పి సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో ప్రొబేషనరీ ఎస్ఐ గిరిమనోహర్‌రెడ్డి, కానిస్టేబుల్ ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, శేఖర్, శ్రీను, నారాయణ, అయోధ్య, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఖాజ ఉన్నారు.

విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

- బీఆర్ఎస్ యువజన సంఘం అధ్యక్షుడు కొర్ర వంశీ



నడింపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో పరిశీలిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

అచ్చంపేటటౌన్/ కొల్లాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభు త్వం విద్యార్థులపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని బీఆర్ ఎస్ పార్టీ యువజన సంఘం అధ్యక్షుడు కొర్ర వంశీ అన్నారు. గురుకుల బాటలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో తనిఖీ చేశారు. ఈ ప్రభుత్వంలో ఎంతోమంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో ఆసుపత్రుల పాలయ్యారన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నాయకులు రాజేష్, రాకేష్, రవి, రాజు పాల్గొన్నారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో పెంట్లవెల్లి, కొల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల, కస్తూర్బా గాంధీ పాఠశాలలను బీఆర్ఎస్వీ నాగర్‌కర్నూల్ జిల్లా ఇంచార్జీ నవీన్ చంద్ర రెడ్డి, జిల్లా నాయకుడు శేఖర్ పరిశీలించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను నిర్వీర్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు .

'ఎమ్మెల్యే వివేక్‌పై ఆరోపణలు తగదు'

అచ్చంపేటటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై ఆరోపణలు చేయడం తగదని మాలమహానాడు డివిజన్ ప్రధాన కార్యదర్శి కుంద ఆంజనేయులు అన్నారు. మాలల సింహగర్జన సభ విజయవంతం కావడం తట్టుకోలేక కొంత మంది ఆయనపై ఆరోపణలు చేస్తున్నారని తగదని హెచ్చరించారు. నాయకులు మహేష్, రవి, మనోజ్ పాల్గొన్నారు.

పశువులకు ఖనిజ లవణ మిశ్రమాన్ని అందించాలి

- ప్రొఫెసర్లు వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి



ఊర్కొండపేటలో పశువులను పరీక్షిస్తున్న ప్రొఫెసర్లు

ఊర్కొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పశువులకు ఖనిజ లవణ మిశ్రమాన్ని అందించినప్పుడే అవి ఆరోగ్యకరంగా ఉంటాయని ప్రొఫెసర్లు డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిలు అన్నారు. పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, పశు వైద్య కళాశాల రాజేంద్రనగర్ విద్యార్థులు, పశు సంవర్ధక శాఖ, విజయ డెయిరీల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఊర్కొండపేట పశు వైద్యశాల ఆవరణలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చూడి నిలవని, గర్భకోశ వ్యాధులు, దీర్ఘకాల వ్యాధులు ఉన్న పశువులను పరిక్షించి నిపుణులైన అధ్యాపకులచే అవసరమైన శస్త్ర చికిత్సలు చేయడంతో పాటు చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో పశువులకు ఖనిజ లవణాల లోపం ఉందన్నారు. ఈ శిబిరంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.జి.వి.రమేష్, మండల పశు వైద్య అధికారి డా.రాజేష్ గ్రామస్థులు రవీంద ర్, మనోహర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, హరీష్ ఉన్నారు.